క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకోవాలి

జగ్గయ్యపేట అర్బన్: పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ దేవస్థానం వద్ద దుకాణ సముదాయంలో గురువారం రాత్రి జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొదమల ప్రభుదాసు కోరారు. ప్రభుత్వం వారికి నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని, వారు తిరిగి వ్యాపారాలు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు బియ్యం వితరణ



పెనుగంచిప్రోలు: స్థానిక శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా కాలిపోయిన దుకాణాల చిరు వ్యాపారులకు 19 మందికి ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం చొప్పున శుక్రవారం విజయవాడకు చెందిన శ్రీనివాస ట్రాన్స్‌పోర్టు తరపున జి.రామ్మోహన్ అందజేశారు. కార్యక్రమంలో పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, ట్రాన్స్‌పోర్టు ప్రతినిధి అనుమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

అమ్మవారి కల్యాణ పీటలపై కూర్చునే దంపతుల ఎంపిక

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మ వారి కల్యాణ మహోత్సవంలో పీటలపై కూర్చునే దంపతులను శుక్రవారం ఆలయ ప్రాంగణంలో లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఫిబ్రవరి 5 న జరిగే కల్యాణంలో శ్రీతిరుపతమ్మ వారి తరపున ఆమె ఇంటి పేరు గల కొల్లా వారి తరపున కొల్లా రాజశేఖర్, అపర్ణ దంపతులు ఒక్కరే దరఖాస్తు చేసుకోగా, శ్రీగోపయ్య స్వామి తరపున కాకాని ఇంటి పేరు గల వారు 11 మంది దరఖాస్తు చేసుకోగా లాటరీలో కాకాని రంజిత్ కుమార్, నిశిత దంపతులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఈఓ లీలాకుమార్, ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, ఈఈ వైకుంఠరావు, పాలకవర్గ సభ్యులు కోలా రామారావు, కురువెళ్ల రాయప్ప, ఆదిమూలం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న విద్యార్థినికి అభినందన



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శ్రీమతి గెంటేల శకుంతలమ్మ(ఎస్‌జీఎస్) కళాశాలకు చెందిన బీకాం ప్రథమ సంవత్సరం విద్యార్థిని పి.నాగలక్ష్మి గురువారం ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో ఎన్‌సీసీ క్యాడెట్‌గా పాల్గొందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఈ విద్యార్థిని 17(ఎ)ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ క్యాడెట్‌గా కాకినాడలో నిర్వహించిన ఢిల్లీ రిపబ్లిక్ డే క్యాంప్ ఎంపికలో మూడు క్యాంపుల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనపరచిందని ఎన్‌సీసీ కేర్ టేకర్, పీడీ జి.రవి తెలిపారు. కాకినాడ గ్రూపు నుంచి సీనియర్ మహిళల కేటగిరిలో ఎంపికై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన పరేడ్‌లో పాల్గొందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్య కమిటీ సెక్రటరీ కె.సాయిబాబు, ఏవో కె.సత్యనారాయణ, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జీడీవీ ప్రసాద్, అధ్యాపకులు నాగలక్ష్మికి అభినందనలు తెలిపారు.

తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి

కంచికచర్ల: తడి, పొడి చెత్తను వేరువేరుగా విభజించి పంచాయతీ సిబ్బందికి సహకరించాలని పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్ అన్నారు. మండల కేంద్రమైన కంచికచర్లలో శుక్రవారం ఆయన పర్యటించారు. చెత్తబండి వస్తుందా లేదా అని పలు వీధుల్లో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలో ఉన్న చెత్తను రోడ్ల వెంబడి పడేయరాదని లేకపోతే తీవ్రమైన దుర్వాసన వచ్చి అంటురోగాల బారిన పడతారన్నారు. పట్టణంలోని ప్రతి వీధిలోకి చెత్తను సేకరించే వాహనం వస్తుందని, వాహనం రాకపోతే పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చని అన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి చెత్త బండి రాగానే వేయాలన్నారు. పట్టణంలోని జుజ్జూరు రోడ్డు, వసంతకాలనీ, హనుమాన్‌పేట, తీగెలబజార్, గొట్టుముక్కల రోడ్డులో ఆయన పర్యటించారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

నందిగామ: విద్యార్థులకు తప్పనిసరిగా మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంఈఓ బి.బాలాజీ సూచించారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులు పరిశీలించడంతో పాటు నాడు–నేడు కార్యక్రమంలో కాదు భాగంగా జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని అన్ని తరగతి గదులు పరిశీలించి విద్యార్థుల ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఉంటాం

- తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేత
- ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తాం
- విశాలమైన దుకాణాలు నిర్మించి ఇస్తాం
- ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



బాధితులకు తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను

పెనుగంచిప్రోలు: అగ్ని ప్రమాద బాధితులకు తప్పక న్యాయం చేస్తామని, బాధితులకు అండగా ఉంటామని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. గురువారం అర్ధరాత్రి 2 గంటల తరువాత శ్రీతిరుపతమ్మ వారి ఆలయం వద్ద అగ్ని ప్రమాదం జరిగిన దుకాణాల సముదాయాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ దురదృష్టవశాత్తు సిలిండర్ లీకై మంటలు వ్యాపించి దుకాణాలు కాలిపోయాయని, ప్రమాదంలో తిరునాళ్ల ఉత్సవాలకు పెద్ద ఎత్తున తెచ్చి నిల్వ చేసుకున్న సరుకు కాలిపోయాయన్నారు.

నష్టపోయిన వారు చిరు వ్యాపారాలు చేసుకునే బడుగు, బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలని, ఈ సంఘటనపై దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, కమిషనర్ హరి జవహర్ లాల్, సీఎంఓ కార్యాలయానికి తెలియజేశామన్నారు. చిరు వ్యాపారులను దృష్టిలో ఉంచుకుని ఆలయ పాలకవర్గం, అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మూడు రకాల ప్రయోజనాలు కల్పిస్తున్నామన్నారు. తక్షణం రూ.10 వేలు సాయం అందించటంతో పాటు దుకాణాలు కాలిపోయిన 19 మందికి విశాలమైన దుకాణాలు నిర్మించి ఏడాది పాటు అద్దె లేకుండా చేస్తామన్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం తరపున సాయం అందిస్తామన్నారు. ఆలయం వద్ద రూ.15 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, దానిలో భాగంగా విశాలమైన దుకాణాల సముదాయం ఏర్పాటు చేస్తామన్నారు. దుకాణదారులు కూడా దుకాణాల్లో గ్యాస్ సిలిండర్లు పెట్టుకోవటం, వంటలు చేయటం వంటివి చేయకూడదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు వూట్ల నాగమణి, పూసల, మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు చేని కుమారి, బత్తుల రామారావు, ఆలయ ఈఓ లీలాకుమార్, చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్, తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ కె.శామ్యూల్, ఆలయ ధర్మకర్తలు కోలా రామారావు, కురువెళ్ల రాయప్ప, ఆదిమూలం నరసింహారావు, మండల ఉపాధ్యక్షుడు గుంటుపల్లి వాసు, మండల కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జానీమియా తదితరులు పాల్గొన్నారు.

సర్వం కోల్పోయిన చిరు వ్యాపారులు

అగ్నిప్రమాదంలో 19 దుకాణాలు దగ్ధం

పెనుగంచిప్రోలు: శ్రీ తిరుపతమ్మ వారి ఆలయం వద్ద దుకాణాల సముదాయంలో గురువారం అర్ధ రాత్రి రెండు గంటల సమయంలో ఒక దుకాణం నుంచి వచ్చిన మంటలు వేగంగా వ్యాపించి 19 దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. అయితే ప్రాణనష్టం లేకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంలో దుకాణాలు మొత్తం బూడిదై చిరు వ్యాపారులు సర్వం కోల్పోయి భోరున విలపిస్తున్నారు. బాధితుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో ఆవేదనగా ఉంది.



మంటల్లో కాలిపోయిన స్కూటర్

మొత్తం బూడిదయ్యాయి



అగ్ని ప్రమాదంలో దుకాణంలో మొత్తం సరుకు బూడిద అయింది. ప్రమాదంలో మంగళ సూత్రాలు, పట్టీలు కూడా కాలిపోయాయి. బొమ్మలు, సరుకులు మొత్తం బూడిద అయ్యాయి. రూ.2లక్షలకు పైగా నష్టపోయాను. పెట్టుబడి మొత్తం వడ్డీలకు తెచ్చాను. ఇప్పుడేం చేయాలో అర్థం కావడం లేదు.

–కత్తుల వెంకట్రావమ్మ

దుకాణంతో పాటు డబ్బులు కాలిపోయాయి



మంటల్లో షెడ్ పూర్తిగా కాలిపోయింది. రూ.1.50 లక్షల విలువ చేసే సరుకుతో పాటు ఇల్లు బాగు చేయించుకునేందుకు నోటు రాసి తెచ్చిన లక్ష రూపాయిల నగదు కాలిపోయింది. షెడ్ పక్కనే పెట్టిన స్కూటీ కూడా కాలిపోయింది. బయటకు పరిగెత్తి ప్రాణాలు కాపాడుకున్నాం.

– చింతకాయల పద్మ

రూ.4లక్షల వరకు నష్టపోయాం



రెండు దుకాణాలకు సంబంధించి రూ.4లక్షల వరకు నష్టం వచ్చింది. ముందు రోజే హైదరాబాద్ నుంచి అందరూ సరుకు తెచ్చి దుకాణాల్లో నిల్వ చేశారు. దుకాణంలో సరుకుతో పాటు పెట్టెలో ఉంచిన నగదు కూడా కాలిపోయింది.

–మురదకోల వీరన్న

క్షణాల్లో మంటలు వ్యాపించాయి



ప్రమాదంలో దుకాణంలో రేగిన మంటలు క్షణాల్లోనే అన్ని దుకాణాలకు వ్యాపించాయి. సిలిండర్లు ఉండటంతో దగ్గరకు వెళ్లలేకపోయాం. కళ్ల ముందే కాలి బూడిదైంది. దుకాణంలో సామగ్రి అన్నీ కాలిపోయాయి.

–భద్రయ్య, ప్రత్యక్షసాక్షి

చిరు ధాన్యాల సాగుకు అనేక రాయితీలు

- ఉచిత బీమా సౌకర్యం
- ఉత్పత్తులకు మార్కెటింగ్‌లో మరెన్నో అవకాశాలు
- నందిగామ సహాయ వ్యవసాయ సంచాలకుడు రమణమూర్తి



కంచికచర్ల మండలం పరిటాల రైతు భరోసా కేంద్రంలో చిరుధాన్యాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రమణమూర్తి

కంచికచర్ల: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలంలోని పరిటాల రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం 'చిరు ధాన్యాలు క్లస్టర్ గ్రూప్‌ల ఏర్పాటు, చిరుధాన్యాలు ఆరోగ్యంపై చూపే సత్ఫలితాలు' అనే అంశంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో నందిగామ సహాయ వ్యవసాయ సంచాలకుడు ధర్మపురి రమణమూర్తి మాట్లాడుతూ ప్రపంచ చిరుధాన్యాల ఉత్పత్తిలో 20 శాతం, ఆసియా ఖండం ఉత్పత్తిలో 80 శాతం మన దేశం వాటా కలిగి ఉందన్నారు. మన దేశం చూపిన ప్రత్యేక చొరవతోనే ఐక్యరాజ్యసమితి ఈ సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా గుర్తించిందన్నారు. 8 రకాల చిరు ధాన్యాలలో జొన్నసాగు ఈ ప్రాంతానికి అనుకూలంగా ఉందన్నారు. చిరుధాన్యాలు సాగుచేసే ప్రతి క్లస్టర్ రైతుకు ప్రతి హెక్టార్‌కు రూ.6వేలు చొప్పున వివిధ వనరులు, వ్యవసాయ పనిముట్లను రాయితీపై ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రూ.1.50లక్షలు సబ్సిడీపై ప్రాసెసింగ్ యూనిట్లను రాయితీపై అందిస్తామని చెప్పారు. ఈ పంటలను ఉచిత బీమా పథకంలో చేర్చటమే కాకుండా వీటికి బ్యాంకుల ద్వారా రుణ సౌకర్యం ఇప్పించటం, కనీస మద్దతు ధర లేని వాటికి క్వింటాకు రూ.2,500 నగదు ఇప్పిస్తామన్నారు. చిరు ధాన్యాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపర్చేవిధంగా (అపెడ) వారి సౌలభ్యంతో జియో, మా, మెట్రో మార్ట్‌లతో కలసి అమ్మకాలు చేపడతామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకంలో ఈ ఉత్పత్తులతో కనీసం వారానికి రెండు రోజులు మెనూలో చేర్చి అంతర్గత మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. గరికపాడు కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నంద్యాల పరిశోధన కేంద్రంలో జొన్న ఇతర చిరుధాన్యాలపై పరిశోధనలు, విత్తనోత్పత్తి జరుగుతోందని, విత్తనాలు కావల్సిన రైతులు సంప్రదించాలన్నారు. హోం సైన్స్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ దిగుబడుల మీద విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసే విధానం గురించి ఏ రకంగా విలువ జోడించవచ్చో తెలిపారు. అనంతరం చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన రైతులకు చూపించారు.

కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.వి జయకుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరెడ్డి, శివప్రసాద్, రాజనరసింహ, వ్యవసాయ సహాయకులు రఘు, చంద్రశేఖర్, సొసైటీ అధ్యక్షుడు మాగంటి వినయభూషణరావు, నెమలిపురి అమ్మారావు, కమిటీ నాయకులు చింతా రవీంద్రనాథ్, బత్తుల శేషయ్య, కర్ల రామకృష్ణ, ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

అల్లూరు(వీరులపాడు): వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని ఎస్‌ఐ సోమేశ్వరరావు అన్నారు. మండలంలోని అల్లూరు గ్రామ శివారులో శుక్రవారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఖ్యంగా ఆటోవాలాలు పరిమితి మేరకే ప్రయాణికులను ఎక్కించాలని, నిబంధనలను అతిక్రమించి పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కేసు నమోదు చేయటంతో పాటు ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన పత్రాలను విధిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు.

5న తిరువూరు రానున్న బహుజన చైతన్య యాత్ర

నందిగామ: బహుజన రాజ్యాధికార చైతన్య యాత్రను జయప్రదం చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజు అన్నారు. పాడేరులో ప్రారంభమైన బహుజన రాజ్యాధికార చైతన్య యాత్ర తిరువూరుకు రానున్న నేపథ్యంలో శుక్రవారం సంబంధిత యాత్రకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుష్పరాజ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 5వ తేదీన తిరువూరుకి రానున్న యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, ఖలీల్, రామకృష్ణ, కిషోర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

డెప్యూటీ కలెక్టర్‌గా వెళుతున్న తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ నాగేశ్వరరావును సన్మానిస్తున్న రెవెన్యూ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల ట్రైబల్ వెల్ఫేర్ విభాగం ఏలూరుకు డెప్యూటీ కలెక్టర్‌గా ఉద్యోగోన్నతిపై వెళుతున్న కె.నాగేశ్వరరావుకు శుక్రవారం రాత్రి ఘన సన్మానం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ వారి కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ఏర్పాటుచేసిన ఆత్మీయ అభినందన కార్యక్రమంలో నాగేశ్వరరావు దంపతులను పలువురు ప్రముఖులతో పాటు, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. నందిగామ ఆర్డీవో రవీంద్రరావు, పేట ఎంపీడీవో జయచంద్ర, పట్టణ ఎస్‌ఐ రామారావు, వీఆర్‌వోల సంఘం జిల్లా అధ్యక్షుడు రాటకొండ శ్రీనివాసరావు, టీడీ నాగరాజు, ఆర్‌ఐ ఆనంద్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసకుమార్, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు పాల్గొని అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఉద్యోగాలకు ఎంపిక

జూపూడి(ఇబ్రహీంపట్నం): నిమ్రా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ అక్బర్‌ఖాన్ తెలిపారు. 50 మంది నాలుగో ఏడాది ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు బెంగుళూరుకు చెందిన కోడ్‌నెస్ట్ కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్‌లు నయన్‌కుమార్, హర్ష వివిధ విభాగాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రతిభ కలిగిన 10 మందిని ఎంపికచేసి నియామక పత్రాలుఅందజేశారు.

నిరుద్యోగుల భవిత కోసమే జాబ్‌మేళా

186 మందికి నియామక పత్రాలు



జాబ్‌మేళాలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: మెగా జాబ్ మేళాలు ఏర్పాటు చేసింది రాజకీయంగా లబ్ధి పొందేందుకు కాదని, నందిగామ ప్రాంత విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, డిస్ట్రిక్ట్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో స్థానిక కేవీఆర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన పోలీస్ ఉద్యోగాలకు సైతం ఎమ్మెల్యే, తాను సొంత ఖర్చుతో ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసి 300 మందికి పైగా కోచింగ్ ఇచ్చామని తెలిపారు. జాబ్‌మేళాకు విశేష స్పందన వచ్చిందని 21 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనగా 941 మంది రిజిస్ట్రేషన్ చేయించుకుని ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు.

మరో 172 మందికి మరోసారి ఇంటర్వ్యూ

జాబ్‌మేళాలో పాల్గొన్న నిరుద్యోగ యువతకు కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన 186 మందిని ఎంపిక చేశారని ఎమ్మెల్సీ అరుణకుమార్ తెలిపారు. మరో 172 మంది అభ్యర్థులు కూడా ఎంపికయ్యారని, వారికి మరోసారి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఎంపికైన 186 మందికి ఆయా కంపెనీల ప్రతినిధులతో కలిసి శుక్రవారం రాత్రి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం ఇంటర్వ్యూల నిర్వహణకు పూర్తి సహాయ సహకారాలు అందించిన కళాశాల అధ్యాపకులు వాసుదేవరావు, ఉలవలపూడి నరేంద్రను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్ర, ఏసీపీ నాగేశ్వరరెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ జయరాం, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చల్లా బ్రహ్మేశ్వరరావు, పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్ రెడ్డి, నాయకులు పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, యాకుబ్ వలీ, విశ్వనాథపల్లి కృష్ణారావు, మారం అమరయ్య, కర్రి రవీంద్ర, పలువురు నాయకులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్లకు ప్రభుత్వం అండ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను



కంచికచర్లలో ఎలక్ట్రీషియన్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు

ప్రభుత్వ విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్లకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా సహకారం అందిస్తూ వారికి అండగా ఉంటామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద సామినేని విశ్వనాథం కార్మిక నగర్‌లో జగ్గయ్యపేట పట్టణ ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆల్వా థామస్ ఎడిసన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో త్వరలో 11 ఫార్మా కంపెనీలు నిర్మించనున్నారని, స్థానిక ఎలక్ట్రికల్ వర్కర్లకే ఉపాధి కల్పించే విధంగా వారితో మాట్లాడతామన్నారు.

11 కార్మిక సంఘాల వారికి స్థలాలు

నియోజకవర్గంలో 11 కార్మిక సంఘాల వారికి ప్రభుత్వ అనుమతితో స్థలాలను కేటాయించి సొంత భవనాలు నిర్మించుకునే అవకాశం కల్పించామని ఎమ్మెల్యే ఉదయభాను చెప్పారు. పట్టణంలో కార్మికులకు గతంలో ఏనాడూ ఏ ప్రభుత్వం ఇంత మంచి చేయలేదన్నారు. యూనియన్ సభ్యులు విజ్ఞాపన పత్రాన్ని అందజేయగా సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఉదయభానును యూనియన్ సభ్యులు సన్మానించారు. యూనియన్ గౌరవ సలహాదారు కొండూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్(బాజీ), ఏఎంసీ వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, కౌన్సిలర్లు వట్టె మనోహర్, తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు గుంజ లక్ష్మణ్, బీసీ నేత ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇనపనుర్తి యోహాను, కోనేరు సత్యనారాయణ పాల్గొన్నారు.

కంచికచర్లలో...

కంచికచర్ల: ప్రయివేటు ఎలక్ట్రీషియన్‌ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. పట్టణంలో ప్రయివేటు ఎలక్ట్రీషియన్స్ డే వేడుకల్లో శుక్రవారం ఆయన పాల్గొని ముందుగా జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులమతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్రయివేటు ఎలక్ట్రీషియన్స్ పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని, ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే పరిష్కరిస్తామని చెప్పారు.

నందిగామలో...

నందిగామ టౌన్: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఎలక్ట్రీషియన్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తొలుత థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ సమస్యలు, ఇబ్బందుల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఏపీపీ ఈశ్వరప్రగడ రంగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు వీసం దుర్గారావు, పాకాలపాటి కిరణ్, మారం అమరయ్య, గద్దె శేషుకుమారి, యూనియన్ నాయకులు ఇంటిమాల ఆనంద్, షేక్ కరిముల్లా, యార్లగడ్డ కిషోర్, కనగాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీ నరసింహారావుకు ఘన సన్మానం



ఏజీపీ నరసింహారావును సన్మానిస్తున్న న్యాయవాదులు, బాల్య మిత్రులు

జగ్గయ్యపేట అర్బన్: అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన టీఎల్ నరసింహారావును శుక్రవారం పట్టణంలో ఆయన బాల్య మిత్రులు ఘనంగా సన్మానించారు. స్థానిక ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న ఏజీపీ నరసింహారావు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పసుపులేటి సత్యశ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి సామాన్య కుటుంబంలో పుట్టి అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడరు స్థాయికి ఎదిగిన నరసింహారావు పట్టణంలో పలువురికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఆయన రానున్న కాలంలో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట, పరిసర ప్రాంతాలకు చెందిన ఉపాధ్యాయులు ఆజ్మీరు శ్రీనివాసరావు, బి.రవికుమార్, ఆజ్మీరు కొండ, న్యాయవాదులు పి.నాగరాజు, జె.వెంకట్రావు, దాసరి నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, కె.రాజేష్, అనిల్, బజారుసాయి, పోస్టల్ డిపార్ట్‌మెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వసంతరావు పాల్గొన్నారు.

ఆర్డీవోకు పలువురి అభినందన



నందిగామ: గణతంత్ర దిన వేడుకలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న నందిగామ ఆర్డీవో రవీంద్రరావును శుక్రవారం పలువురు అభినందించారు. డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, సిబ్బంది కార్యాలయానికి వచ్చి ఆర్డీవోను అభినందించారు. కార్యక్రమంలో నందిగామ, చందర్లపాడు తహసీల్దార్ లు నరసింహారావు, సుశీల, డెప్యూటీ తహసీల్దార్ రిష్కా రాణి, పలు కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సోషల్ ఆడిట్ గ్రామ సభలు

జగ్గయ్యపేట: మండలంలోని తక్కెళ్లపాడు, బలుసుపాడు, ముక్త్యాల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ గ్రామ సభలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ అధికారులు 2020–22 వరకు రెండేళ్లలో గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల వివరాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం సంతోష్, కార్యదర్శులు సుబ్బారావు, నరసింహారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.